సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 4 । జూన్ । 2023

9



'కుస్తీ'మే సవాల్..

కుస్తీ పోటీలకు యువత సై అంటోంది. కెల్ల గ్రామంలో కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. పతకాల పంట పండిస్తున్నారు.

- 10లో



ఆధార్ అప్‌డేట్‌లో తప్పులు రానివ్వొద్దు

సచివాలయాల్లో చేపడుతున్న ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లనీయకుండా జాగ్రత్త పడాలని డీఆర్‌ఓ ఎం.గణపతిరావు అన్నారు.

- 10లో

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పార్వతీపురం: ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు బాధితుల సమాచారం తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం ఫోన్: 089632 93046 నంబర్‌ను సంప్రదించాలన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోనూ హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంచారన్నారు.

న్యూస్‌రీల్

పెదబోగిలి ఆర్‌బీకేను సందర్శించిన కలెక్టర్



పెదబోగిలి ఆర్‌బీకేలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

సీతానగరం: మండలంలోని పెదబోగిలి రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఎరువులు, విత్తన నిల్వలు, కియోస్కో యంత్రం పనితీరును పరిశీలించారు. విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయఅధికారి రాబర్ట్‌పాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, మండల ఏఓ ఎస్.అవినాష్, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పూతికవలస సమీపంలో గజరాజులు



పూతికవలస గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు దాటుతున్న గజరాజుల గుంపు

కురుపాం: కురుపాం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పూతికవలస, కన్నపుదొరవలస గ్రామాల మధ్య గజరాజులు సంచరిస్తున్నాయి. పొలాలకు వెళ్లే రైతులను అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ఏనుగుల సమీపంలోకి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: చదువులో ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం సరోజని దామోదర్ ఫౌండేషన్ విద్యాధన్ ఉపకార వేతనం కోసం ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుకున్న వారు అర్హులన్నారు. పదో తరగతిలో 90 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం 2లక్షల రూపాయలలోపు ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రూ.10వేలు, ద్వితీయ సంవత్సరంలో రూ.10వేలు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. దరఖాస్తు దారులకు జూలై 2న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూ.విద్యాధన్. ఓఆర్‌జీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంఈఓ కృష్ణమూర్తి సస్పెన్షన్ ఎత్తివేత

వీరఘట్టం: మండల విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. జి.సిగడాం మండలం డి.బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా నియమిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీని విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందర్శించినప్పుడు విధులు, పర్యవేక్షణలో లోపాలు కనిపించడంతో ఎంఈఓ కృష్ణమూర్తితో పాటు డీఈఓ, జీసీడీఓ, కేజీబీవీ ఎస్‌ఓలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే డీఈఓ, జీసీడీఓలపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. తాజాగా కృష్ణమూర్తిపై ఉన్న సస్పెన్షన్ కూడా ఎత్తివేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కేజీబీవీ ఎస్‌ఓ రోహిణిపై ఉన్న సస్పెన్షన్‌ను కూడా ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించాయి.

బీమా భరోసా



పార్వతీపురం పట్టణం 30వ వార్డులో బీమా నమోదు చేస్తున్న వలంటీర్ వి.తరుణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగి సాంబమూర్తి

పార్వతీపురం మన్యం జిల్లాలో లబ్ధిదారులు ఇలా...			
మండలం	లబ్ధిదారుల సంఖ్య	మండలం	లబ్ధిదారుల సంఖ్య
బలిజిపేట	17,611	పాలకొండ	12,909
భామిని	12,906	పాలకొండ అర్బన్	7,368
గరుగుబిల్లి	12,763	పార్వతీపురం	17,637
గుమ్మలక్ష్మీపురం	12,763	పార్వతీపురం అర్బన్	11,373
జియ్యమ్మవలస	15,230	సాలూరు	17,077
కొమరాడ	15,343	సాలూరు అర్బన్	12,862
కురుపాం	13,483	సీతంపేట	15,502
మక్కువ	14,483	సీతానగరం	16,680
పాచిపెంట	14,300	వీరఘట్టం	18,262

- ఊరూరా వైఎస్సార్ బీమా నమోదు ప్రక్రియ
- ఈనెల 7వ తేదీలోగా నమోదు చేసుకోవాలి
- 18నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు
- ఆపదసమయంలో బీమా అండ
- జిల్లాలో 2,58,702 మందికి రెన్యూవల్ ప్రక్రియ
- కొత్తగా నమోదు చేసుకునే అవకాశం

పార్వతీపురం టౌన్: కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినా.. వైకల్యం బారిన పడినా ఆ కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకుంటుంది. జీవనానికి ఇబ్బందులు పడుతుంది. ఆపదవేళ ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు, ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ఆచరణలోకి తెచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీమా నమోదు ప్రక్రియను ప్రారంభించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 2,58,702 మంది వైఎస్సార్ బీమా పథకంలో నమోదై ఉన్నారు. ఇప్పటికే బీమా చేసుకున్న వారు ఈ ఏడాదికి రెన్యూవల్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. బీమా కొనసాగింపు నిర్ధారించేందుకు, ఈ నెల 7వ తేదీ నాటికి పాలసీదారు వయస్సు ప్రమాద బీమా అర్హతకు మించితే ఆ స్థానంలో కుటుంబంలోని మరో సంపాదనపరుడిని ఎంచుకోవచ్చు. వారి పేరుపై బీమా చేసుకోవాలి. కొత్త బీపీఎల్ కుటుంబాలు ఈకేవైసీ ద్వారా బీమా నమోదుకు అవకాశం ఉంది. ఈ నెల 7వ తేదీ నమోదుకు చివరి రోజు కావడంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నమోదు ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

వలంటీర్ల ఆధ్వర్యంలో..

వైఎస్సార్ బీమా పథకం కింద అర్హులైన వారిని వలంటీర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారు. బీమాకింద సభ్యుల నమోదుకోసం వివరణాత్మక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)పై ఇప్పటికే వలంటీర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. సర్వే చేసిన సభ్యుల కోసం పీబీఈ మార్పు, నామినీ మార్పు, పేరు తదితర వివరాలు మార్పు చేస్తారు. బీమా పథకానికి అర్హులైన వారిని కొత్తగా నమోదు చేస్తారు.

కొత్త మార్గదర్శకాలు ఇలా..

- బీమా చట్టం 1938లోని సెక్షన్ 39 ప్రకారం జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా వారిపై ఆధారపడిన వ్యక్తులను ప్రాథమిక కుటుంబ పోషణదారుడు (పీబీఈ) తమ నామినీని లేదా నామినీలుగా నియమించుకోవచ్చు.
- బీమా పొందేవ్యక్తి వయస్సు 18-70 ఏళ్ల మధ్య ఉండాలి. ఆ వ్యక్తి దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి. ప్రాథమికంగా సంపాదనపరుడై ఉండాలి.

ప్రయోజనాలు ఇలా..

- వైఎస్సార్ బీమా కుటుంబంలో ఒకరికి ప్రధానంగా కటుంబానికి ఆర్థిక తోడ్పాటునిచ్చే వ్యక్తికి బీమా వర్తింపజేస్తారు.
- 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు సహజ మరణం పొందిన, 70 ఏళ్లలోపు ప్రమాద మరణం పొందినబీమా వర్తిస్తుంది.
- సహజ మరణానికి రూ. లక్ష పరిహారం అందజేస్తారు.
- ప్రమాదమరణానికి రూ. 5లక్షలు, పూర్తి అంగ వైకల్యం పొందితే రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యం పొందితే రూ.2.50 లక్షలు అందుతుంది.
- పాలసీదారుడు మరణిస్తే విషయాన్ని సచివాలయంలోని సంక్షేమ సహాయకునికి సమాచారం అందించిన వెంటనే ప్రభుత్వం ద్వారా అంత్యక్రియల ఖర్చుకు రూ.10వేలు అందజేస్తుంది.

పేదలకు ఆర్థిక లబ్ధి చేకూరేలా..



పేదలకు ఆర్థిక లబ్ధి చేకూరేలా వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. కుటుంబంలో పోషించే వ్యక్తి మరణించిన, వైకల్యం బారిన పడిన సమయంలో కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ఆర్థిక ఉపశమనాన్ని కలిగిస్తుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 2,58,702 మంది వైఎస్సార్ బీమా పథకంలో నమోదై ఉన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మరింత మందికి లబ్ధి చేకూరనుంది. అర్హులంతా తమ వలంటీర్లను సంప్రదించి వైఎస్సార్ బీమా పథకంలో సభ్యత్వం పొందవచ్చు.

– పి.కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

మంత్రిని కలిసిన జేసీ

సాలూరు: పార్వతీపురంమన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.గోవిందరావు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను సాలూరులో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని దుశ్శాలువతో సత్కరించారు. ఇటీవల మంత్రి కాలికి గాయం కావడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖాపరమైన అంశాలపై చర్చించారు.



ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను కలిసిన జేసీ

90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

- పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: వాటర్‌షెడ్ పథకం కింద రైతులకు 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్టు పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడ గ్రామ పంచాయతీకి చెందిన వాటర్‌షెడ్ పథకం రైతులకు ప్రధాన మంత్రి సించాయి యోజన (పీఎస్‌ఐ) ద్వారా మంజూరైన వ్యవసాయ పరికరాలను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలోని 1046 మంది రైతుల కోసం పీఎస్‌ఐ 2.0 నిధులు రూ.72 లక్షలతో కొనుగోలు చేసిన బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు వంటి వ్యవసాయ పనిముట్లను 90 శాతం రాయితీతో అందజేస్తున్నామని చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన లక్కగూడ గ్రామ పరిసరాల్లోని సహజ వనరుల యాజమన్యం పనులతో పాటు ఎస్.కె.పాడు ఉద్యానవన నర్సరీ కేంద్రంలో జరుగుతున్న పర్యాటకాభివృద్ధి పనులు పరిశీలించారు. ఆయన వెంట టీడబ్ల్యూ ఈఈ శాంతేశ్వరరావు, ఎంపీడీఓ సాల్మన్‌రాజు, వాటర్‌షెడ్ పీఓ రెడ్డి పోలినాయుడు ఉన్నారు.



లక్కగూడలో వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

నేటి నుంచి ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్ టోర్నీకి విజయనగరం ఆతిథ్యమివ్వనుంది. లీగ్ పద్ధతిలో జరిగే టోర్నీలో బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్, విజయనగరం రోయల్స్, వైజాగ్ డాల్ఫిన్స్ జట్లు తలపడనున్నాయి. డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు విశాఖలో గల డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో అత్యధిక పాయింట్లు సాధించిన జట్టుకు 11వ తేదీ జరిగే ముగింపు కార్యక్రమంలో ట్రోఫీ ప్రదానం చేయనున్నారు.

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: కేజీబీవీల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రిక్వెస్టు బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లాలోని 11 కేజీబీవీలు, పాత శ్రీకాకుళంలోని 3 కేజీబీవీలలో పనిచేసే సిబ్బంది ఈ నెల 5 నుంచి 7వ తేదీలోగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఏమైనా మార్పులుంటే పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

మార్కెట్‌కు మామిడి కళ

- దిగుబడి పెరగడంతో తగ్గిన ధర
- కిలో రూ.20లు నుంచి లభ్యం
- ఎకరా తోటలో 4 నుంచి 6 టన్నుల దిగుబడి
- జిల్లాలో 30 వేల హెక్టార్లలో మామిడిసాగు
- బంగినపల్లి, సువర్ణరేఖ, కోలంగోవ, కలకటేరు, రసాలు లభ్యం



రాజాం: మార్కెట్‌లో మామిడి కళకళలాడుతోంది. పండ్ల రాజు ఈ వేసవిలో సామాన్యునికి సైతం అందుబాటులోకి వచ్చింది. గతేడాది నాణ్యమైన మామిడిఫలం తినాలంటే సామాన్యునికి కష్టంగా ఉండేది. ఈ ఏడాది సాధారణ స్థాయికంటే దిగువన ధరలు ఉండడంతో నాణ్యమైన మామిడి పండ్లను ప్రతీ ఒక్కరు కొని తినగలుగుతున్నారు.

గతేడాది కంటే పెరిగిన దిగుబడి

జిల్లాలో ఈ ఏడాది మామిడి దిగుబడి పెరిగింది. గతేడాది సాధారణంగా ఎకరాకు 3 టన్నుల దిగుబడి రావడం కష్టంకాగా, ఈ ఏడాది సరాసరి 4 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. మొక్క తోటలో ఎకరాకు 4 టన్నుల కాయలు దిగుబడి రాగా, ముదర తోటల్లో ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు ఇక్కడ నుంచి నాణ్యమైన పండ్లు ఎగుమతి అయ్యేవని, ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో దిగుబడి ఉండడంతో స్థానికంగానే నాణ్యమైన పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. బంగినపల్లి, సువర్ణరేఖ, చెరకురసం, పనుగులు, కలకటేరు, రసాలు, కోలంగోవ వంటి పండ్ల జాతులు కిలో రూ.20 నుంచి రూ.25ల మధ్య లభిస్తున్నాయి.

జిల్లాలో 30వేల హెక్టార్లలో సాగు

జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఉపాధిహామీ పథకం కింద చాలా ప్రాంతాల్లో రైతులు గతంలో వేసిన మొక్క మామిడితోటలు పూతకు రావడంతో మామిడిసాగు మరికొంతమేర అధికమైంది. ఈ ఏడాది 30 లక్షల టన్నులకుపైగా మామిడి దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మెట్టవలస పీచుమాను, హిమామ్‌పసందు, పనుగులు వంటివి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో సగటున రూ.50 కోట్ల మేర ఈ ఏడాది మామిడి వ్యాపారం జరుగుతుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. ఈ ఏడాది రసాయనాలతో మగ్గించిన పండ్లు కంటే గడ్డితో సాధారణ పద్ధతిలో మాగబెట్టిన పండ్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. రాజాం, మెరకముడిదాం, గంట్యాడ, కొత్తవలస, జామి, లక్కవరపుకోట, ఎస్.కోట, దత్తిరాజేరుతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక విస్తీర్ణంలో మామిడితోటలు సాగులో ఉన్నాయి.

30వేల కుటుంబాలు..

మామిడిపంట పండించి జీవనం సాగిస్తున్న కుటుంబాలు జిల్లాలో 30వేలు వరకూ ఉన్నాయి. డిసెంబర్, జనవరి నెలలు అనంతరం ఈ కుటుంబాలు మామిడి తోటలు లీజుకు తీసుకుని కాపు కాస్తారు. మే నెల నుంచి పంట చేతికంది విక్రయాలు చేస్తారు. సీజన్ ప్రారంభంలో టన్ను మామిడి కాయలు ధర రూ.25వేలు ఉండేది. ఎగుమతి తగ్గడంతో వీటి ధర రూ.15 వేలకు పడిపోయింది. దీంతో వీటిని పండ్లగా మార్చి స్థానికంగా విక్రయాలు చేస్తున్నారు. ఎకరా తోటలో సగటున రూ.60వేల నుంచి రూ.70 వేల విలువైన సరుకు అమ్ముడుపోగా, లాభం రూ.30వేలు వస్తుందని కౌలు రైతు మురళీ తెలిపారు. ధర పెరిగితే ఆదాయం బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.



రాజాంలోని ఓ తోటలో గుత్తులుగా కాసిన మామిడి చెట్టు

అనుకూల వాతావరణం

ఈ ఏడాది మామిడి పూతకు వాతావరణం అనుకూలించింది. పిందె నిలిచింది. ఎకరాకు సగటున 4 నుంచి 5 టన్నుల దిగుబడి వచ్చింది. అన్ని ప్రాంతాల్లోనూ ఈ ఏడాది మామిడి దిగుబడి ఉండడంతో ధర తగ్గింది. సామాన్యునికి నాణ్యమైన పంట అందుబాటులోకి వచ్చింది.

– ఏపీఎస్ జమదగ్ని, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి, విజయనగరం

12న విత్తన మహోత్సవం

పార్వతీపురం: గుంటూరులోని ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 12న విత్తన మహోత్సవం జరగనుందని కేవీకే శాస్త్రవేత్త ఎస్.స్రవంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో వరి, కంది, మినుములు, పెసర, శనగ, వేరుశనగ, నువ్వులు, రాగులు, కొర్రలు, జొన్నలు తదితర విత్తనాలకు సంబంధించి సమాచారాన్ని ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి



గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జావెలిన్‌తో ప్రాక్టీస్ చేస్తున్న చిరంజీవి

సీతంపేట: జాతీయ స్థాయి జావెలెన్‌త్రో పోటీలకు స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన వూయక చిరంజీవి ఎంపికయ్యారు. కొద్ది నెలల కిందట శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. భోపాల్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు జరగనున్న క్రీడల్లో చిరంజీవి పాల్గొననున్నట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణమూర్తి తెలిపారు.

ఏపీఓ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏపీఓ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాపరమేశ్వరి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్.కోట ఏపీఓగా పని చేస్తున్న బి.రమ్య, ఎల్.కోట, డెంకాడ, రామభద్రపురం మండలాలకు చెందిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. ఎల్.కోటలో వేతనదారులు పనికి వెళ్లకపోయనా గత రెండు వారాలుగా మస్టర్లు వేసి వారి నుంచి డబ్బులు వసూలు చేసారనే అభియోగాలపై ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని పీడీ తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు సత్కారం



డీఆర్ సృజనను సత్కరిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.సృజనకు ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నుండి బదిలీపై వెళ్తున్న సృజనను జిల్లాలోని 11 మంది సబ్ రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు, సిబ్బంది శనివారం డీఐజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డీఐజీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆమె విధి నిర్వహణలో సేవలను కొనియాడారు.

ఉద్యోగ మేళాకు స్పందన



ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారిణి అరుణ

విజయనగరం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీ, ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. విశాఖపట్నంలోని సీనరీజస్ కాస్టింగ్స్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు నిర్వహించిన మేళాలో 142 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించిన సంస్థ ప్రతినిధులు తదుపరి రౌండ్‌కు 62 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. అరుణ, ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ టీవీ గిరి, అధ్యాపకులు ఎం.యశ్వంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



శ్యామ్ ఇంద్రజాల ప్రదర్శన

విజయనగరం అర్బన్: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రముఖ ఇంద్రజాలికుడు జాదూగర్ శ్యామ్ పలు మ్యాజిక్‌లు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలం అప్పలనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డెంకాడ మండలం ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు అడ్మినిస్ట్రేటివ్ అధికారి దాసరి బంగారయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

'కుస్తీ'మే సవాల్..

గతంలో గ్రామాల్లో కుస్తీ పోటీలు ఎక్కడికక్కడ తారసపడేవి. ఎటువంటి పండుగలైనా.. పిల్లలకు సెలవుల సందర్భాల్లోనైనా ఈ పోటీలు కనిపించేవి. ముఖ్యంగా పండు వెన్నెలలో గ్రామాల్లో ఈ పోటీలు ఆడుతూ సందడి చేసేవారు. అంతా ఒకేచోట కూడి సరదాగా... ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యవంతంగా ఉండేవారు. ప్రస్తుతం కాలం మారింది. క్రీడలూ మారాయి. ఆ క్రమంలో గ్రామీణ క్రీడగా ఉన్న కుస్తీ ఆటంటే ఎవరికీ తెలియకుండా పోయింది. అయినా ఆ క్రీడకు గుర్తింపు తెచ్చేలా ఆసక్తి కలిగిన కొందరు నేటికీ శిక్షణ ఇస్తూ గుర్తింపు పొందుతున్నారు.

- కుస్తీలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్న యువత
- జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక
- కుస్తీ, కబడ్డీలకు ఉచిత శిక్షణ



వ్యాయామం చేస్తున్న కుస్తీ క్రీడాకారులు

గుర్ల: ఒకప్పుడు ప్రతి గ్రామంలో కుస్తీ పోటీలు ఎక్కడికక్కడే జరిగేవి. ప్రస్తుత కాలంలో ఆ పోటీలంటేనే చాలా మందికి తెలియని పరిస్థితి. ఆధునిక కాలంలో కుస్తీ పోటీలకు లభించే ఆదరణ అంతంతమాత్రంగానే ఉంటుంది. అయినా కుస్తీ పోటీలపై మక్కువ ఉన్న కొందరు శిక్షణ ఇస్తూ ఉనికిని చాటుతున్నారు. మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన కర్రోతు జగదీష్, ఉదయ్‌కుమార్ కుస్తీ, కబడ్డీ క్రీడలపై నేటి యువతను చైతన్యపరుస్తూ శిక్షణ ఇస్తున్నారు. ఈ పోటీల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ యువతను ఆకర్షిస్తున్నారు.

40 మందికి శిక్షణ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గరివిడి, గుర్ల మండలాలకు చెందిన 40 మంది యువత, విద్యార్థులకు కుస్తీ, కబడ్డీ క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు సరైన క్రీడా స్థలం లేకపోయినప్పటికీ క్రీడలలో రాణించేలా తగిన తర్ఫీదు ఇస్తున్నారు. కుస్తీలో రాణించాలనే దృఢ సంకల్పంతో విద్యార్థులు కఠోర శ్రమతో కూడిన శిక్షణ తీసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి కుస్తీ, కబడ్డీ పోటీలలో ఇప్పటికే రజతం, కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికవుతున్నారు.

ఎనిమిదిసార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు



గుర్ల గ్రామానికి చెందిన వాళ్లే చిన్నారావు చీపురుపల్లిలోని డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు రెండు బంగారు, మూడు రజతం, మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. జాతీయ స్థాయి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కుస్తీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో పతకం గెలవాలనే సంకల్పంతో శిక్షణ తీసుకుంటున్నాడు.

'బంగారు' మోహన్



రాష్ట్ర స్థాయి కుస్తీ క్రీడా పోటీలలో గుర్ల గ్రామానికి చెందిన కలిశెట్టి మోహన్ ఇప్పటి వరకు మూడు బంగారు పతకాలు సాధించాడు. మోహన్ తొమ్మిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీటిలో మూడు బంగారు, రెండు రజతం, నాలుగు కాంస్య పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో రాణించాలనే ఉద్దేశంతో శిక్షణ తీసుకుంటున్నాడు.

ఉత్తమంగా రాణిస్తూ...



జాతీయ స్థాయి పోటీలకు పొన్నాడ ఉమామహేశ్వరరావు రెండు సార్లు ఎంపిక కావడంతో పాటు ఆ పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఉమామహేశ్వరరావు నెల్లిమర్లలోని డిగ్రీ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. ఆరుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని రెండు రజతం, రెండు కాంస్య పతకాలు సాధించాడు.

జాతీయ స్థాయి పోటీలకు లావణ్య



జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గరివిడి మండలానికి చెందిన వైగాల లావణ్య శిక్షణ తీసుకుంటుంది. లావణ్య ఈ నెల 6న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననుంది. కబడ్డీలో కూడా రాష్ట్రం తరఫున ఆడుతుంది. కుస్తీలో రాణించడమే ధ్యేయమని చెబుతుంది. కుస్తీలో రాణించడానికి ఏడాదిగా శిక్షణగా తీసుకుంటుంది.

గుర్తింపు తెచ్చేలా...



జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో రాణించి గుర్తింపు తెచ్చి పతకాలు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాను. శిక్షణ తీసుకుంటున్న వారిలో ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో పతకాలు సాధించారు. కుస్తీపై యువత, విద్యార్థులకు అవగాహన పెంచి కుస్తీ శిక్షణ ఇస్తున్నాం. కుస్తీలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో శిక్షణను ఉచితంగా ఇస్తున్నాం. ప్రతి రోజు 40 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారు.

– కర్రోతు జగదీశ్, కుస్తీ కోచ్, కెల్ల



రాష్ట్ర స్థాయి పోటీలలో కుస్తీ పడుతున్న యువకులు(ఫైల్)

జాతీయ ఖోఖో పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన సబీర్, దిలీప్

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగున్న అండర్ – 19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు విజయనగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరగనుండగా... విజయనగరం ఖాదర్ నగర్‌కు చెందిన సబీర్, దాసన్నపేటకు చెందిన దువ్వ దిలీప్ అర్హత సాధించారు. ఇటీవల జిల్లా వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ పోటీలకు శనివారం బయలుదేరారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. జాతీయ పోటీల్లో క్రీడా ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శనివారం సైక్లింగ్ ఫర్ హెల్త్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు వారి ఒత్తిడి నుంచి బయట పడడానికి, మానసిక స్థితిని మెరుగుపరచుకోవడానికి వ్యాయమం ఒక చక్కటి మార్గమని చెప్పారు. రక్త పోటు నియంత్రణలోను, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని నియంత్రించడానికి వ్యాయమం దోహదపడుతుందని తెలిపారు. సైక్లింగ్ వలన అసంక్రమిత వ్యాధులు ఊబకాయం, రక్త పోటు, మధుమేహం, గుండె జబ్బులను దూరం చేసుకోవచ్చునని చెప్పారు. ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండడానికి వ్యాయమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. క్రమం తప్పని వ్యాయమం మంచి నిద్రకు ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ కృతి, డాక్టర్ రవికుమార్, డెమోలు చిన్నతల్లి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా జగనన్న



సజ్జల తదితరులతో అబ్దుల్ హమీద్

బొబ్బిలి: మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ అన్నారు. శనివారం విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన మైనార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై చర్చించారు. జిల్లాకు సంబంధించిన మైనార్టీల సమస్యలను, అవసరాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	55,300–00
బంగారం(22సి. 10గ్రా.)	60,330–00
వెండి (కిలో)	77,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

ఆధార్ అప్‌డేట్‌లో తప్పులు రానివ్వొద్దు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, డీఎల్‌డీఓ నిర్మలాదేవి

- డీఆర్‌ఓ ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: సచివాలయాల్లో చేపడుతున్న ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లనీయకుండా జాగ్రత్త పడాలని డీఆర్‌ఓ ఎం.గణపతిరావు అన్నారు. జిల్లాలోని ఆధార్ అప్‌డేట్ కేంద్రాలున్న సచివాలయ డిజిటల్ సెక్రటరీలకు స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఒక రోజు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేసుకోవాలనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తప్పులు లేని ఆధార్ అందించాలని, ఆ దిశగా వ్యక్తగత అంశాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో – ఆర్డినేటర్ అశోక్ అవగాహన తరగతులను నిర్వహించారు. డీఎల్‌డీఓలు నిర్మలాదేవి, లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధార్ రీజినల్ కోఆర్డినేటర్ గిరిధర్, జిల్లా కో ఆర్డినేటర్ నారాయణరావు, గ్రామ, వార్డు సచివాలయాల అసిస్టెంట్ జిల్లా కో – ఆర్డినేటర్ రాము, అధార్ కేంద్రాలున్న సచివాలయాల డిజిటల్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



మృతి చెందిన హరీష్



ఘటనా స్థలంలోనే మృతి చెందిన లక్ష్మి

పార్వతీపురం: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం పట్టణం రెల్లివీధికి చెందిన అప్పలస్వామి ద్విచక్ర వాహనంపై తన మనవడు సొండి హరీష్(మూడున్నరేళ్లు)తో వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్నారు. ఇదే మార్గంలో పార్వతీపురం నుండి గుమ్మ లక్ష్మీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోపెడ్‌పై వున్న అప్పలస్వామి, హరీష్ కింద పడిపోయారు. హరీష్ బస్సు టైర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పలస్వామి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాలుడి మృతదేహానికి శవపంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుని తండ్రి కరుణాకర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారావు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మహిళ దుర్మరణం



బొద్దాన లక్ష్మి(ఫైల్)

పాలకొండ: పాలకొండ – రాజాం రహదారిలో వెంకటగౌరి సినిమా థియేటర్ వద్ద శనివారం లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే...నగర పంచాయతీ పరిధి గటాలదెప్పివీధికి చెందిన బొద్దాన లక్ష్మి(55) తాగునీరు సేకరించేందుకు వెళ్లగా పాలకొండ నుండి రాజాం వైపు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే లక్ష్మి మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ బి.శివప్రసాద్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం చేయించారు. ఈమె భర్త ఇటీవలే మరణించారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహమైంది.

గ్రీన్ ర్యాలీ రేపు

విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న సోమవారం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉదయం 7 గంటలకు గ్రీన్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఆడిటోరియంలో కలెక్టర్ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదుగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వేతర సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

భోగాపురం: మండలంలోని ముక్కాం కూడలి వద్ద ఎస్‌ఐ కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నాతవలస చంపావతి నది నుంచి భోగాపురం వైపు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈవీఎం కొత్త గోదాంను పరిశీలించిన జేసీ



ఈవీఎం కొత్త గోదాంను పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న ఈవీఎం నూతన గోదాంను జేసీ మయూర్ అశోక్ శనివారం పరిశీలించారు. ముందుగా గోదాంకు వేసిన తాళాలను, సీళ్లను జేసీ తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అనంతరం గోదాంపైన నూతనంగా నిర్మించిన కొత్త భవనాన్ని పరిశీలించారు. వేర్వేరు భవనాల్లో భద్రపరిచిన ఈవీఎంలను ఒకే భవనంలోకి చేర్చడానికి చర్యలు చేపట్టాలని డీఆర్వో ఎం.గణపతిరావుకు సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరచడానికి సరిపడే విధంగా భవనాన్ని నిర్మించినట్లు డీఆర్వో తెలిపారు. భవనానికి కల్పిస్తున్న భద్రత, సీసీ టీవీల ఏర్పాటును వివరించారు. జేసీ వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్, నెల్లిమర్ల తహసీల్దారు కేవీ రమణరాజు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం తహసీల్దారు దేవప్రసాద్ తదితరులున్నారు.